

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ : డ్రెయిన్ కాలువలను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని స్థానిక ప్రజలకు కమిషనర్ నందన్ సూచించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గ్రాండ్ ట్రంకు రోడ్డు ప్రాంతంలో పర్యటించారు. కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన మెట్లు, ర్యాంపులు వంటి ఇతర నిర్మాణాలు పూడికతీతకు అడ్డంకి ఉంటే తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో..'అంబానీ'..!

- రిలయన్స్ భూ మాయ
- ఎకరా రూ 7.5 లక్షలతో 2700 ఎకరాలు స్వీకరణ
- అప్పట్లో రూ.200 కోట్లు పరిహారం
- ఇప్పుడు రూ 1,350 కోట్లు ఆస్తి
- రైతుల పంటనష్టం రూ. 568 కోట్లు

రిలయన్స్ థర్మల్ పవర్ ప్రాజెక్టు పేరుతో కృష్ణపట్నం గ్రామ ప్రజలను రిలయన్స్ అంబానీ నిలువునా ముంచేశారు...పరిశ్రమ పెడుతానని, ఉద్యోగం, ఉపాది దొరకుతొందని నమ్మ బలికారు..అప్పటి అధికారపార్టీ నేతలు, అంబానీ మాటలు నమ్మిన ప్రజలు 18 ఏళ్ల నుంచి కన్నీళ్లు దిగ మింగుతున్నారు.. 2007లో ఎకరా 7.50 లక్షల చొప్పున 2,700 ఎకరాలు తీసుకున్నారు... ఇప్పటికీ అక్కడ పరిశ్రమ లేదు..ఉద్యోగం..ఉపాధి లేదు.. ఇప్పటి వరకు గ్రామ రైతులు సుమారు రూ 568 కోట్లు విలువైన పంటను కొల్పోయారు. ఇప్పుడు ఒక్కో ఎకరా ఇక్కడ రూ 50 లక్షలు పలుకుతోంది. దీనిని విక్రయించాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.. ఇప్పుడు ఆ భూమి విలువు సుమారు రూ 1350 కోట్లు... దీనిని విక్రయించుకోడానికి రిలయన్స్ ప్రయత్నాలు చేస్తుంది. మా భూములు మాకివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఇది ఓ గ్రామ దీన స్థితి.. ఇటీవల వరకు రాష్ట్రంలోనే ఎంతో పేరు తెచ్చుకున్న కృష్ణపట్నం పరిస్థితి చూసి అందరూ అయ్యో పాపం అంటున్నారు. 2007లో కృష్ణపట్నం పోర్టుతోపాటు, బొగ్గు ఆధారంగా థర్మల్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఈ ప్రాంతంలో 33వేల మెగావాల్ట్ విద్యుత్ ఉత్పత్తికి 33 వేల ఎకరాలు స్వీకరించారు. అందులో రిలయన్స్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఒకటి. రూ 20 వేల కోట్ల పెట్టు బడితో 4 వేల మెగావాల్ట్ థర్మల్ ప్రాజెక్టు పెట్టడానికి ముందుకొచ్చారు. అందుకు కృష్ణపట్నం గ్రామానికి చెందిన పంట భూముపై కన్నుపడింది. రైతులు తమ భూములు ఇచ్చేదిలేదని తెగేసి చెప్పారు. ఎకరాకు రూ 5 లక్షలు ఇస్తామని చెప్పగా, అప్పటి ప్రతిపక్ష నేత , ప్రస్తుత సర్వేపల్లి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సిపిఎం పక్షాల ఆందోళనతో ఎకరాకు రూ 7.50 లక్షలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఇక్కడ పరిశ్రమ వస్తే 'మీ పిల్లలు, ఉద్యోగాలు, ఉపాధి వస్తుందని, గ్రామం రూపు రేఖలే మారిపోతాయని నమ్మించారు. కాంగ్రెస్‌పార్టీ నేతల మాటలతో రైతులు తమ గ్రామ పరిధిలో ఉన్న మొత్తం భూమి 2700 ఎకరాలు రిలయన్స్ సంస్థకు అప్ప గించారు. పచ్చనిపోలాలు, రెండు కార్లు పండే పంటకు వద్దనుకొని ఇచ్చేశారు.. .

18 ఏళ్లుగా రూ 568 కోట్ల పంట నష్టం...!

కృష్ణపట్నం గ్రామంలో రెండు పంటల పండే విలువైన భూమికి రిలయన్స్ ఇచ్చేశారు. ఇప్పటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అక్కడ పరిశ్రమ రాలేదు. ప్రతి ఏడాది రెండు కార్లు పండే పోలాల్లో ఏడాదికి 16వేల పుట్లు ధాన్యం దిగుబడి వచ్చేది. ఇప్పటి వరకు ఆ పొలాల్లో పంట పండించి ఉంటే సుమారు 2.91 లక్షల పుట్లు ధాన్యం దిగబడి వచ్చేది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పంట విలువ సుమారు రూ 568 కోట్లు ఉంది. 2007లో రిలయన్స్ సంస్థ మొత్తం భూసేకరణ కోసం రూ 202 కోట్లు ఖర్చుచేసింది. అక్కడ పరిశ్ర మల వచ్చి ఉంటే గ్రామంలో పరిస్థితులు మరోలా ఉండేవి. ఇప్పుడు పంట భూములు లేక పనులు లేక ప్రజలు వలసలు వెళుతున్నారు. కృష్ణపట్నం పోర్టు దెబ్బతినడంతో ఆ గ్రామం పరిస్థితి దయనీయంగా మారింది. చేయడానికి పొలం లేక, చేసేందుకు పనిలేక ఇబ్బందులు పడుతున్నారు. ముత్తుకూరు ప్రాంతంలోనే అతిపెద్ద గ్రామ మైన కృష్ణపట్నం రిలయన్స్ మోసంతో దెబ్బతింది.

థర్మల్‌పవర్ ప్రాజెక్టు బోర్డు

భూమి విలువ రూ 1350 కోట్లు...!

రిలయన్స్ అంబానీ 2007లో కేవలం రూ 202 కోట్లతో కొనుగోలు చేసిన భూమిలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇక్కడ ఎకరా సుమారు రూ 50 లక్షలు పలుకుతొంది. బిపిసిఎల్ సంస్థ పెట్రో పైప్‌లైన్ కోసం ఎకరా రూ 50 లక్షల చొప్పున చెల్లించినట్లు సమాచారం. 2700 ఎకరాల భూమి ఖరీదు సుమారు రూ 1350 కోట్లు. ఇప్పటికే పంట లేకపోవడంతో సుమారు రూ 568 కోట్లు రైతులు నష్టపోయారు. ఈ భూముల ద్వార ఇక్కడ రైతులు సుమారుగా రూ 1918 కోట్లు నష్టం జరినట్లు లెక్కలు చెబుతున్నాయి. పరిశ్రమలు పెట్టకుండా గత కొద్ది కాలంలో రిలయన్స్ సంస్థ ప్రభుత్వానికి లేఖలు పెడుతోంది. రిలయన్స్ థర్మల్ భూములు విక్రయించడానికి అవకాశం కల్పించాలని కోరుతొంది. మరో వైపు పరిశ్రమ పెట్టకుంటే మా భూములు మాకివ్వండి అనే డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు రిలయన్స్ ప్రతినిధులు ప్రభుత్వంతో నిత్యం రాయబేరాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

భూమి పోయే...ఉపాధి లేదు..

కృష్ణపట్నం గ్రామంలో వ్యవసాయ పనులు చేసే కూలీలు, పంట పండించే రైతులు 18 ఏళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ రోజు , రేపు అంటూ కాలం గడిచిపోతూనే ఉంది. కృష్ణపట్నం పోర్టులైనా ఏదో ఒకపనిచేసుకొని జీవిస్తుండా ఇప్పుడు అది పోయింది. కంటైనర్ టెర్మినల్ వెళ్లిపోవడంతో వందలాది మంది జీవనోపాది దెబ్బతింది. గ్రామంలో చేయడానికి ఏ పని లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. అక్కడ నుంచి 25 కిలో మీటర్లు నెల్లూరు వచ్చిన చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొందరైతే పెద్దలు పెట్టి హైదరాబాద్, బెంగళూరు వెళ్లిపోయారు. ఓ కార్పొరేట్ సంస్థ ధన దా హానికి పచ్చని కృష్ణపట్నం ఇప్పుడు జీవచ్చంలా ఉంది.

18 ఏళ్ల కింద రిలయన్స్ తీసుకున్న భూములు

'జిఎస్‌టి 2.0' ప్రజలకు ప్రయోజనం..!

కలెక్టర్ హిమాన్షు శుక్లా

మీడియాతో మాట్లాడుతోన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరిందని, ఇది ఒక పొదుపు పండుగ అనికలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ విసిల హాలులో జిఎస్టీ 2.0 సంస్కరణపై జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్టఇ 2.0 వ్యవసాయం, పారిశ్రామిక, భవన నిర్మాణం, విద్యారంగం, వర్తక రంగాలకు ఎంతో ఊత మిస్తుందన్నారు. ప్రజలు వినియోగించే నిత్యావసరాలు, మెడిసిన్, వ్యసాయ పరికరాలు, భవన నిర్మాణ సామాగ్రి, ఆటోమొబ్కెల్ రంగాల్లోని ఉత్పత్తులపై భారీగా జిఎస్‌టి తగ్గిందన్నారు. దీంతో ధరలు తగ్గి అన్నివర్గాల ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధానంగా సిమెంటు ధరలపై జిఎస్‌టి 28శాతం నుంచి 18శాతానికి తగ్గడంతో భవన నిర్మాణ రంగం బలోపేతమవుతందన్నారు. నిత్యావసరాలు పూర్తిగా ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, పెన్నులు ఇతర సామాగ్రిపై జిఎస్టీ తగ్గడంతో తల్లిదండ్రులకు ఊరట కలుగుతుందన్నారు. అన్నిరకాలకు జిఎస్టీ 2.0తో ప్రయోజనాలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికి జిఎస్టీ ఫలాల పేరుతో తగ్గిన నిత్యావసర వస్తువుల వివరాలకు, కలుగుతున్న ప్రయోజనాలను ప్రతి ఇంటికి వివరించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను ఈనెల 30 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు, మానవ వనరుల అభివద్ధి, డిజిటల్ సాధికారతపై అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు, వికాస్ విశ్వాస్ నమ్మకమైన అభివద్ధిపై అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. అక్టోబర్ 19న జిఎస్టీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

విజయవాడలో కరేడు రైతులు ధర్నా

ప్రజాశక్తి - ఉలవపాడు

రాష్ట్రంలో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ, కరేడు రైతులు బుధవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, దడాల సుబ్బారావు అధ్యక్షత సభ నిర్వహించారు. వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివద్ధి పేరుతో, బలవంతపు భూసేకరణ చేస్తూ, ప్రజల వద్ద భూములు లాక్కొని నిరాశ్రయులు చేయడం ఎంతవరకు న్యాయమని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కరేడు గ్రామంలో, మూడు పంటలు, పచ్చటి పొలాలను, తీసుకొని, ఇండోసాల్ కు పెట్టడం వలన, ప్రజలకు, ఒరిగేది ఏమిటి, రాష్ట్రంలో, లక్షలాది ఎకరాలు భూములు తీసుకొని, రైతులను దివాలా దీవించి, కార్పొరేట్లను కుబేరులను చేస్తున్నారని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, బి బలరాం, ప్రత్యేక హెూదా రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి . మాల్యాద్రి, కరేడు గ్రామ రైతులు, గంజి ప్రసాద్, సుజాత, తదితరులు పాల్గొని ప్రసంగించారు. లో భూ పోరాట నాయకులు, జి వెంకటేశ్వర్లు, జి.వి.బి కుమార్, దువ్వూరు జాన్, గొల్లపోలు శివ, మల్లవరపు అంకమ్మరావు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని పూరేటిపల్లి పంచాయతీలోని గ్రామ సచివాలయంలో ఉలవపాడు ప్రాజెక్ట్, సిడిపిఓ మాధవి లత ఆదేశాల మేరకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లా డుతూ చిన్నపిల్లలకు శిశువులకు పౌష్టి కాహారమైన ఆహార పదా ర్థాలను అందించాలన్నారు. పండ్లు. ఆకుకూరలు అలాగే అనేక రకాల పౌష్టిక ఆహారాన్ని ఏ విధంగా అందించాలో వివరించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి . డాక్టర్ జి .రమ్య. వైద్య సిబ్బంది.నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు. ఉమ్మినేని సుబ్బారావు, అంగన్వాడి కార్యకర్తలు ఎన్ .నిర్మల. అన్నపూర్ణ. పి .భూలక్ష్మి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంతోపాటు 10 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేశారు. డైకాస్ రోడ్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పరిశీలించారు. శిబిరంలో కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు సిటీ 46వ డివిజన్ ఇందిరా భవన్ రోడ్డు లోని అన్నా క్యాంటీన్ ను కమిషనర్ నందన్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. డివిజన్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. నిర్దేశించిన ప్రమాణాలను క్యాంటీన్ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ చూపించారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి -నెల్లూరు : ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే ఆదేశాల మేరకు ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు చీరాల వెంకట నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ వెంగళరావునగర్, కేఎన్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ భక్తవత్సల నగర్ ఎన్సిసి క్యాడెట్లు నెల్లూరు రంగనాయకులపేట సమీపాన ఉన్న పెన్నా నది రోడ్డు బ్రిడ్జి తదితర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచారు. ఎన్ సి సి పెట్టీ ఆఫీసర్ దీపక్ కుమార్ , ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

'ఇంటూరి'ని విమర్శించే స్థాయి

వైసిపి నేతలకు లేదు : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు

ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదని స్థానిక టిడిపి నాయకులు పేర్కొన్నారు. మీరు చేసే అవినీతి అందరూ చేస్తారు అనుకుని విమర్శించడం అవివేకం..కోర్టులో ఫైళ్లు చోరీకి పాల్పడిన వ్యక్తి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమా అంటూ టిడిపి నేతలు వైసిపి నాయకులు ఎద్దేవా చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామాయపట్నం పర్యటన సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుపై విమర్శలు చేయడంపై వారు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. కోర్టులో తనపై ఉన్న కేసు ఫైల్ దొంగతనం చేయించిన ఘనుడు కాకాని గోవర్ధన్ రెడ్డి అని అన్నారు.ఎంఎల్ఏగా ఉన్న సమయంలో కనిగిరి నియోజకవర్గంలో బుర్రా ఎన్ని అక్రమాలు చేశాడో ప్రజలకు తెలియనివి కావన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగిర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, ఆంధ్ర ప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు,షేక్ రూబీ, చిత్తారి మల్లికార్జున పాల్గొన్నారు...

స్పీకర్ స్థానంలో బీద రవిచంద్ర

ప్యానెల్ స్పీకర్‌గా 'బీద'..

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలిలో ప్యానెల్ స్పీకర్‌గా ఎంఎల్‌సి బీద రవిచంద్ర వ్యవహరించారు. బుధవారం ప్యానెల్ స్పీకర్‌గా వ్యవహరించి, స్పీకర్ కుర్చీ నుంచి సభా కార్యక్రమాలను నడిపించారు. సభలో జరిగే చర్చలను శాంతంగా వినిపిస్తూ, సభ్యుల అభిప్రాయాలకు సమాన అవకాశ మిస్తూ..అధికార, ప్రతిపక్ష సభ్యుల చర్చలు సజావుగా కొనసాగేలా చూశారు.

వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : పర్వతరెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 700 మంది వైద్య విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని ఎంఎల్‌సి పరవత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన శాసనమండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. వైద్య విద్య పూర్తి చేయాలని ఎంతోమంది కలలో కంటున్నారని మన రాష్ట్రంలో వైద్య సీట్లు తక్కువగా ఉండటం ద్వారా విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించే వారి సంఖ్య ఎపి నుంచి ఎక్కువగా ఉందన్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రానికి చెందిన 700 మంది విద్యార్థులు వైద్య విద్యను పూర్తిచేసుకుని పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లభించక ఎన్నో ఇబ్బందులు పడుతూ కోర్టు చుట్టూ తిరుగుతూ రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

'మామిడి' ముందే పూసింది..!

ప్రజాశక్తి - ఉలవపాడు

కోయిల ముందే కూసింది.. అన్న చందంగా ఈ ఏడాది మామిడి చెట్లు ముందే పూతకొచ్చాయి. ఉలవపాడు ఉద్యానవన శాఖ పరిధిలో ఈ ఏడాది మూడు నెలల ముందే మామిడి తోటల్లో చెట్లకు పూతలు పెట్టాయి.. సాధారణంగా మామిడి తోటలకు ఏటా డిసెంబర్, జనవరి నెలలో పూత వస్తుంది. ఏప్రిల్ – మే నెలలో కాయలు కోతకు కోస్తాయి. ప్రతి ఏడాది కోతల అనంతరము ఉమ్మ కాపు కింద కొన్ని తోటల్లో కొన్ని రకాల మామిడి చెట్లకు పూతలు వస్తాయి. ఆ కాపు కాయలుగా మార్కెట్లో క్రయ విక్రయాలు జరుగుతాయి.వాటిలో ఎక్కువ శాతం నీలం, బెంగుళూరు, చెరుకు రసాలు చెట్లకు ఈ రకం కాపు కాయలు వస్తాయి. అవి తోటలో చెట్ల మీదే ఉన్న సమయంలోఈ ఏడాది ముందస్తుగా నీలం, బెంగళూరు, నాటు రకాలు, బంగినపల్లి తదితర మామిడి చెట్లకు పూతలు వచ్చాయి. దీంతో కౌలు రైతులు మామిడి తోటలో ముందస్తుగా వచ్చిన పూతలకు మందులు కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. మరి కాపు ఏవిధంగా ఉంటుందో వేచిచూడాలి..

పూతతో ఉన్న మామిడి చెట్లు

బిటిఎ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కందుకూరు

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కందుకూరు బాలుర ఉన్నత పాఠశాలలో నూతన జాతీయ విద్యా విధానం– విద్యా వ్యవస్థపై దాని ప్రభావం అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్ బాల బోయినచే సెమినార్ బుధవారం నిర్వహించారు. నూతన జాతీయ విద్యా విధానం హిందీ భాషను బలవంతంగా హిందీ యేతర రాష్ట్రాలలో ప్రవేశ పెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. వత్తి విద్యలను ప్రవేశపెట్టి సనాతన ధర్మంలోని వివక్షను ప్రోత్సహించే విధంగా ఉందని తెలిపారు. విద్య అనేది మానవ సమాజాన్ని అభివద్ధి పదంలో పయనింపజేయాలని దేశ సమగ్రతను పెంపొందించే విధంగా ఉండాలనే విద్యా లక్ష్యాలకు విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడారు. నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ మాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతిదినిధి

ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా నోబెట్ టీచర్స్ అసోషియేషన్ నేతలు విమర్శించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాటకం తిరుపతయ్య, చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎన్నో అవమానాలు, కేసులు , బావప్రకటనపై ఆంక్షలు, జీతాభాత్యాలపై నిర్లక్ష్యం, తిరోగమన వేతనస్తిరీకరణ వంటి అంశాల విషయంలో ఎంతో నిరాశ, ఆందోళన చెందారని, కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఉద్యోగులు పనిచేశారని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు కమిషనర్ వై.ఓ నందన్ షోకాజు నోటీసులను జారీ చేశారు.రెవెన్యూ విభాగానికి సంబంధించి అన్ కలెక్టబుల్ డిమాండ్ ప్రొఫార్మా సమర్పించడంలో ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని నోటీసు ద్వారా తెలిపారు.ఆ నివేదికలో కలెక్ట్ అయిన అసెస్మెంట్ నెంబర్లను కూడా త చేశారు. మూడు రోజుల లోపు సంతప్తికరమైన వివరణతో జవాబు ఇవ్వని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కమిషనర్ నోటీసు ద్వారా హెచ్చరించారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన 'బుర్రా'

ప్రజాశక్తి-కందుకూరు

వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డినికందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితులపై మాట్లాడారు. మంగళవారం రామాయపట్నం పోర్టు పరిశీలనకు వెళుతున్న జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, పార్టీ నేతలను పోలీసులు అడ్డుకొని ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని మధుసూదన్ యాదవ్ జగన్ మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లారు. జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తూ మన ప్రభుత్వ హయాంలో 50శాతం పోర్టు పనులను పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2029 లో మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోర్టు పనులను పూర్తి చేసి మనమే ప్రారంభిద్దామని జగన్మోహన్ రెడ్డి చెప్పారని బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై ఆరా తీశారని తెలిపారు.

పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని అభినందిస్తున్న సోమిరెడ్డి

'పెళ్లకూరు' బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మన్‌గా పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి బుధవారం విజయవాడ సీతారామపురం లేబర్ కమిషనర్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తనపై నమ్మకం ఉంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా ఛైర్మన్ గా నన్ను ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వ్యాపారులకు, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన వంతు బాధ్యత ఎవరికి ఇబ్బంది లేకుండా బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ జెడ్ శివకూ

నేడు వ్యకాసం మండల మహాసభ

ప్రజాశక్తి-ముత్తుకూరు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముత్తుకూరు మండల 4వ మండల మహాసభ గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముత్తుకూరు మండలం కార్యదర్శి దంపల ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఈ మహాసభలో నూతన కమిటీ ఏర్పాటు, నివేశ సమస్యలు, భూముల సమస్యలపై చర్చ తదితర అంశాల పైన సమీక్ష కొనసాగుతుందని మండల కార్యదర్శి తెలియజేశారు. మండలంలోని వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున రావాలని కోరారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని కొత్తపల్లి, పాతదేవరాయపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిణి ఈ.శైలజ కుమారి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామంలో రైతులకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనివాస చక్రవర్తి సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. యూరియా అధిక మోతాదులో వాడడం వల్ల భూమి కాలుష్యం, నీటి కాలుష్యం నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడతాయి. భూమి భౌతిక స్థితి దెబ్బతింటుంది. పైరు చీడ పీడలకు గురి అవుతుంది అని తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారిణి కె.కృష్ణవేణి, విఎఎలు లక్ష్మి, ఈశ్వరయ్య, కొత్తపల్లి నాయకులు నరసారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బొల్లినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బంగారు కుంటుంబాలపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : పి-4 పథకంలో గుర్తించబడిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుంటే, వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 'స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పబ్లిక్, ప్రయివేట్, పీపుల్, పార్టిసిపేషన్ (పి-4)పథకంలో భాగంగా కావలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులకు మున్సిపల్‌స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ దత్తత వల్ల బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కనుక ప్రతిఒక్కరూ భాగస్వాములై, బంగారు కుటుంబాలను సిసలైన బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, కావలి నియోజకవర్గ పి-4 యంగ్ ప్రొఫెషనల్ జి.సత్యానందం, మాస్టర్ ట్రైనర్లు చుండి నవీన్ కుమార్ శర్మ, ఓబులాపురం సుధాబాబు, ఎస్.విజయశేఖర్, కె.లలిత్ శ్రీనాథ్ రెడ్డి, వి.తనూజ, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

చెల్లాచెదురుగా పడివున్న దుస్తులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని చావిడి వీధిలోని ఓ ఇంట్లో 13సవర్ల బంగారు చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మూర్తిరాజు చంద్రశేఖర్ రావు (రిటైర్డ్ కరెంట్ లైన్‌మెన్), పాత ఆంధ్రా బ్యాంక్ సమీపం, సెప్టెంబర్ 15న హైదరాబాద్ వెళ్లి బుధవారం (24వ తేదీ) ఉదయం 7.30 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఈ సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం చెంది పరిశీలించగా దొంగతనం జరిగినట్లు బయటపడింది. సుమారు 13 సవర్ల బంగారు నగలు మాయమైనట్లు గుర్తించారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల గ్యాంగ్ అరెస్ట్

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో వరుసగా జరిగిన బైక్ దొంగతనాలపై కోవూరు పోలీసులు పెద్ద ఎత్తున గట్టి దెబ్బ కొట్టారు. నేషనల్ హైవే-16పై స్టంట్స్ చేస్తూ పట్టుబడిన కావలి యువకుడు సాగర్ విచారణలో ఈ దొంగల గ్యాంగ్ బహిర్గతమైంది. శనివారం రాత్రి హైవేపై పహారా నిర్వహిస్తున్న పోలీసుల బృందం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుంది. ఆ యువకుడు సాగర్‌గా తేలగా, గట్టిగా ప్రశ్నించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన మిత్రులు సుహాన్ బాబు, ఆదర్శ గోవింద్‌లతో కలిసి బైకులను టార్గెట్ చేసి వరుస దొంగతనాలు జరిపినట్లు సాగర్ ఒప్పుకున్నాడు. తదుపరి ప్రత్యేక దర్యాప్తులో పోలీసులు మొత్తం 10 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీటి అంచనా విలువ సుమారు రూ.9లక్షలు. స్వాధీనం చేసిన వాహనాల్లో ఎక్కువ భాగం కోవూరు, కావలి ప్రాంతాల్లో దొంగిలించబడినవే కావడం గమనార్హం. బాధితులను పిలిపించి గుర్తింపు ప్రక్రియ పూర్తిచేశారు. నిందితుల ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. వాహనదారులు నిర్లక్ష్యంగా బైకులను రోడ్లపై ఉంచవద్దని, లాక్ సిస్టమ్స్ వినియోగించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు. ఈ అరెస్టుతో ఇటీవల కాలంగా ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తగ్గి, స్థానికులు ఊరట చెందుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చూపిన చాకచక్యానికి రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు, కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-కావలి : కావలి వడ్డెపాలెంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానములో దసరా శరన్నవరాత్రి ఉత్సవములు అంగరంగ వైభవంగా శోభాయమానంగా, ప్రతినిత్యం వివిధ అలంకరణలతో శాస్త్రోక్త బద్ధంగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మ వారిని దర్శించడానికి ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నిటిని ఆలయ కమిటీ చైర్మన్ పల్లెపు మోహన్ ఆధ్వర్యంలో యువ భక్తులతో విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అచంచల భక్తితో జరిపిస్తున్న ఆలయ కమిటీసభ్యులనుప్రజలందరూ ప్రశంసిస్తున్నారు ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆలయ కమిటీ చైర్మన్ తలుపు మోహన్, అమ్మవారి గుడి యొక్క ప్రతిష్టతను స్థల పురాణం గురించి పలు విషయాలు చెప్పడం జరిగింది.ఈ నవరాత్రులు ప్రతి ఒక్కరూ కుటుంబాలతో వచ్చి అమ్మవారి కటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ చైర్మన్ పల్లెపు మోహన్ తెలిపారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని నేలటూరి పంచాయతీ సర్వరాబాద్ గ్రామంలో నవరాత్రులలో భాగంగా శ్రీ తులసి భవాని మాత అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఆలయ ధర్మకర్త దారపనేని కేశవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయ, కర్పూరాలు సమర్పించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రుల పూజ కార్యక్రమాలు అనంతరం దసరా పండుగ రోజు గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు భారీ అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. జరగబోవు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

ఏపీపీగా స్టాలిన్‌బాబు



ప్రజాశక్తి-కోవూరు : స్థానిక అసిస్టెంటు సెషన్సు జడ్జి కోర్టు ఏపీపీగా పూండ్ల స్టాలిన్‌బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియామక ఉత్తర్వులు పొందిన ఆయన బుధవారం భాద్యతలు చేపట్టారు. ఆయనను పలువురు న్యాయవాదులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీ పరిధిలోని చేపల మార్కెట్, మసీదు వీధి నందు పాత విద్యుత్ స్తంభాలను తీసి నూతన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ వైర్లను మార్చేందుకు గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మార్కెట్ వీధి, బంగారు అంగట్లు వీధి, మసీద్ వీధి ఏరియాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బోగోలు మండల విద్యుత్ శాఖ అధికారి జటరాయ తెలిపారు. మండల ప్రజలు వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

ఆరోపణలు చేయడం సరికాదు..

ప్రజాశక్తి-మర్రిపాడు

మాట్లాడుతున్న ఎపిఎం బుజ్జమ్మ

తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఎపిఎం బుజ్జమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎంపై విఒఎ చేసిన నిరాధారమైన ఆరోపణలపై ఎపిఎం బుజ్జమ్మ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామస్థాయిలో చెక్కులు సంఘబంధం అధ్యక్షురాలు పరిధిలో ఉంటాయని తెలిపారు. లావాదేవీలు మాత్రం సంఘ బంధం అధ్యక్షురాలు విఒఎలు జరుపగా సిసిలు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎపిఎం చెక్కులపై సంతకాలు పెట్టి నగదు డ్రా చేసుకునేందుకు వీలులేదన్నారు. బ్యాంకులో సంఘబంధం అధ్యక్షురాలు సంతకాలు స్కాన్ అవుతాయన్నారు. చెక్ తీసుకొని బ్యాంక్‌కు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సంతకం ఒకేలా ఉంటేనే నగదు డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. చెక్కుపై ఫోర్జరీ సంతకాలు చేసి విఒఎల జీతాలు తీసుకున్నారని ఓ పత్రికలో వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. ఆరోపణలు చేసిన విఒఎ నిరూపించాలన్నారు. ఆమె ఉద్యోగంలో చేరి సంవత్సరం అయిందని, 5నెలల క్రితం విధులు సరిగా నిర్వహించడం లేదని సమావేశంలో అడుగగా సిసిని బెదిరిస్తూ విఒఎ ఆడియో రికార్డింగ్ విడుదల చేసింద న్నారు. ఆమెను విచారించగా పొరపాటున జరిగిందని, ఎవ్వరిని కించపరిచే విధంగా ప్రవర్తించనని విధుల్లోకి తీసుకోవాలని తనవైపు నుండి ఏమైనా సమస్యలు వచ్చినా విధుల నుండి తొలగించండని రాతపూర్వకంగా ఆమె ఇచ్చారన్నారు. అప్పులు ఎక్కువగా ఉన్నందున వాటిని రికవరీ చేసి, డేటా తయారు చేయాలని రివ్యూ చేసినందుకు మరోసారి మీడియాలో ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఆమె చేసిన ఆరోపణలు నిరాధారమైనవని మీడియా ముఖంగా తెలియజేశారు. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

ప్రజాశక్తి-వింజమూరు

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని వింజమూరు పట్టణంలో నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రతగా, ఎక్కువకాలం నిల్వ ఉన్న చెత్తను శుభ్రపరిచి, ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాల్లోని చెత్తను తీసివేసి, పరిశుభ్రంగా ఉంచే విధంగా కార్మికులతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నాలుగు అంశాలు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పరిసరాలను శుభ్రం చేసే ఫోటోలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం, ఎక్కువగా నిల్వ ఉన్న చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవడం, కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అందించడంలో భాగస్వామ్యం చేయడం, గ్రామస్థాయిలో ప్రజలతోపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయ పరచడం వంటివి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రామారావు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి

'స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'

ప్రజాశక్తి-బిట్రగుంట

స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బోగోలు మండలం పరిధిలోని ముంగుమూరు గ్రామంలో బుధవారం కోవూరుపల్లి ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ నిత్య ప్రశాంతి ఆధ్వర్యంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ, గర్భిణులకు పౌష్టికాహారం, గర్భాశయ కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, నోటి కేన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రక్తదానం, అవయవదానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి సీనియర్ నాయకులు ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు, పిల్లల కోసం, గర్భవతుల కోసం వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన కార్యక్రమమని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.శ్రీనివాసులు రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వసంత, ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : సంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, అశోక్ కుమార్ స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో భాగంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన అన్నీ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. చిన్న పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ప్రజలు మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపన్నపాళెం సర్పంచ్‌కు గాయాలు

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని గోపన్నపాళెం గ్రామ సర్పంచ్ గండు వెంకారెడ్డికి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలైన ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు.. బెంగళూరులో ఉంటున్న ఆయన వ్యాపార కార్యాలయం నుండి మంగళవారం తన ఇంటికి టూ వీలర్‌పై వెళుతుండగా వెనక నుండి వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలికి ఇనుప చువ్వలు గుచ్చుకోవడం వల్ల గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వైద్యశాలలో చికిత్స పొందిన ఆయన ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం గ్రామంలో తెలియడంతో ఆయనను పరామర్శించేందుకు పలువురు బెంగళూరు వెళ్లారు. ఆయన సర్పంచ్ అయినప్పటి నుండి ప్రతి దసరా సంక్రాంతి పండుగలకు గ్రామానికి వచ్చి పండుగ సంబరాలు పాల్గొనేవారు. ఈ క్రమంలో పలువురు పేదలకు ఆయన కొద్దిపాటి ఆర్థిక సహాయాన్ని కూడా చేసేవారు. దసరా సందర్భంగా ఆయన ప్రమాదాన్ని గురి కావడంతో పేదల్లో నిరాశని స్పృహలు అలముకున్నాయి. ఆయన త్వరగా కోలుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

జిఎస్‌టి పేరుతో దోపిడీ..

- సిపిఐ నాయకులు సిరాజ్ ధ్వజం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

సుమారు గత 8 సంవత్సరాల నుండి జిఎస్‌టి పేరుతో ప్రజాధనాన్ని కేంద్ర ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ విమర్శించారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోనున్న ఆజాద్ సెంటర్‌లోని ఇన్సాఫ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన అనంతరం జిఎస్‌టి రూపంలో ప్రజల నుంచి కోట్ల రూపాయలను దోచుకుందని విమర్శించారు. విచ్చల విడిగా ప్రతి వస్తువులపై అధిక ధరలు పెంచి, జిఎస్‌టి విధించి ప్రజాధనాన్ని కేంద్రం దోచుకుందన్నారు. ఇప్పుడు జిఎస్‌టి తగ్గించాం అని, ప్రతినెలా ప్రజలకు రూ.15వేల నుండి రూ.20 వేల వరకు ప్రజలకు ఆదావుతుందని అనడం ఏమిటని ఎద్దేవా చేశారు. ప్రజలకు జిఎస్‌టి రూపంలో లబ్ధి చేకూరుతుందని, కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పడం ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు షాజహాన్, ఇన్సాఫ్ నగర అధ్యక్షులు లతీఫ్ అహ్మద్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి

ప్రజాశక్తి - ఉదయగిరి

వినతిపత్రం అందజేస్తున్న పొదుపు మహిళలు

ఉదయగిరిని జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ బుధవారం స్థానిక తహశీల్దార్ ఎల్.రామ్మోహన్‌కు పొదుపు సిబ్బంది, మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ గత ఆరేళ్లగా జిల్లా ఏర్పాటు చేయాలని అవగాహన ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. 50 కిలోమీటర్లలో ఉన్న మండలాలను కలిపి వెనుక బడిన ఉదయగిరిని జిల్లా చేయాలని పొదుపు మహిళలతో డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి మంత్రివర్గ ఉప సంఘంను నియమించిందని, అందులో భాగంగా చరిత్ర నేపథ్యం ఉన్న ఉదయగిరిలో ప్రజలు అన్నివర్గాల ప్రజాసంఘాలు విద్యార్థులు అనేక వింతలు అందజేశామన్నారు. అభివృద్ధి వలసలు నియంత్రణ నిరుద్యోగం నిర్మూలనకు వైద్యం రహదారి వెలుగొండ సీతారసాగర్ ప్రాజెక్టులు పూర్తికి ఉదయగిరి జిల్లాతోనే సాధ్యమని అన్ని రకాలుగా అభివృద్ధితో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పొదుపు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-విడవలూరు

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ

మండలంలోని ఊటుకూరు సెక్టార్ ఊటుకూరు సచివాలయం-1 సంబంధించిన అంగన్‌వాడీ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాసోత్సవాలు 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. బాల్య దశ, సంరక్షణ విద్య, శిశుచిన్న పిల్లల అలవాట్లు సంరక్షణలో పురుషులు భాగస్వామ్యంగా ఉండాలని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా పిల్లల్లో వచ్చు ఊభకాయ వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ఎక్కువగా ఆయిల్ ఉపయోగించి వాడిన పదార్థాలను వాడరాదు అని దానివలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.పోలమ్మ, ఆయా ఎం.గంగమ్మ, గర్భిణులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రకటించిన దృష్ట్యా విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని గ్రంథాలయ అధికారి దివానపు నారాయణరావు సంతోషం వ్యక్తపరిచారు. పాఠశాలలు ఉన్నప్పుడు నిత్యం హోంవర్క్, స్టడీ అవర్స్‌లతో బిజీ బిజీగా గడిపిన విద్యార్థులు ఈ సెలవుల్లో గ్రంథాలయ పుస్తక పఠనంపై దృష్టి సారించడం శుభ పరిణామంగా భావిస్తున్నామన్నారు. ఇలాగే ప్రతి తల్లి తండ్రి తమ చిన్నారులను గ్రంథాలయానికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని తద్వారా చెడు తిరుగుళ్ళు, సెల్‌ఫోన్‌లకు దూరం చేయడంతో పఠనాశక్తి పెంపొందించుకుంటారని అభిప్రాయపడ్డారు.

విండ్రో కంపోస్ట్ తయారీ పరిశీలన

ప్రజాశక్తి-కావలి

కావలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో విండ్రో కంపోస్టు తయారీ విధానాన్ని, మోడల్ వార్డు నెంబర్ 39ను చెత్తసేకరించి, పెట్టె బోన్స్, బ్లాక్ స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చిన తులసి వనాలను నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజులుల్లా వారి సిబ్బంది బుధవారం సందర్శించారు. కావలి పురపాలక సంఘం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు, యండి. బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సచివాలయాల సిబ్బందికి పి4 కార్యక్రమంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ నిర్వహించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది బంగారు కుటుంబాలకు, మార్గదర్శి కుటుంబాలకు మధ్య వారధిగా పనిచేసి పేదరిక నిర్మూలనకు సహాయపడాలని సూచించారు. సచివాలయ పరిధిలోని పేద కుటుంబాలను క్లస్టరు వారీగా గుర్తించి సిబ్బంది తమ లాగిన్‌లలో పొందుపరచి వారి అవసరాలను మార్గదర్శి కుటుంబాల వారికి తెలియపరచి సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని తెలియజేశారు. శిక్షణ నిర్వాహకులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సచివాలయ సిబ్బంది లాగిన్ల నిర్వహణ, ఈ పథకానికి సంబంధించిన రిజిస్టర్‌ల నిర్వహణ గురించి శిక్షణనిచ్చారు. డిజిటల్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ కార్యదర్శి శివయ్య శిక్షణ నిర్వహించారు. కార్యాలయ ఎఒ, ఎఎస్ఒ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: GUDURU
O.S.No. 125/2016
Thummala Krishnaiah ...**Plaintiff**
Vs
1. Chevuru Srinivasulu and 4 others ... **Defendants**

దావా సమన్లు

D3: Kota Venkata Subbaiah, S/o. Late Venkatadri, R/o. Mamuduru Village & Post Chejerla Mandal, SPSR Nellore Dist
D4: Prodhuturu Kameswaramma, W/o Chandra Sekhar, Bathulapallipadu Village, Podalakuru Mandal, SPSR Nellore Dist
D5: Palukuru Anumayamma, D/o. Dasaradharami Reddy, Sivagiri Colony, 1st Cross Road, Mulapeta, Nellore, SPSP Nellore Dist

పైన తెలిపిన వాది మీమీద పై కోర్టులో దావాదాఖలు చేసియున్నారు. సదరు దావా హాజరు నిమిత్తం 10.10.2025దిన వాయిదా వేసియున్నారు. కావున మీరు పై కోర్టునందు ఉదయం 10:30గం॥ మీరుగానీ మీ తరపున న్యాయవాదిగానీ పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 10.10.2025

ఇట్లు
యం.విజయరామరాజు, *B.Com., B.L.,*
వాది తరపు న్యాయవాది, గూడూరు

'లోక్ కళ్యాణ మేళా'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న మెప్మా ఎండిటి తేజ్‌భారత్

కావలి మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన "లోక్ కళ్యాణ మేళా"ను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ఎం.డి.టి. తేజ్ భారత్, పి.డి. బి.లీలా రాణిలు పిలుపునిచ్చారు. కావలి మున్సిపాలిటీ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కావలి పురపాలక సంఘం పరిధిలోని వీధి విక్రయదారులు బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పి.ఎం. స్వనిధి 2.0లో భాగంగా మొదట విడత రూ.15వేలు, రెండవ విడత రూ.25వేలకు పెంచి విడుదల చేస్తున్నారని తెలిపారు. కావలిలో మొత్తం 576 వీధి విక్రయదారులకి రుణాలు, వివిధ దశలలో మంజూరు చేసేందుకు గ్రౌన్డింగ్ చేయవలసి ఉందన్నారు. డిజిటల్ ప్రోత్సాహకాలతో పాటు రుణాలపై క్రెడిట్ హామీ, వడ్డీ సబ్సిడీ మొదలైనవి మార్చి 2033 వరకు మద్దతు ఇవ్వ బడతాయని తెలిపారు. క్రెడిట్ కార్డులకు క్రెడిట్ హామీ మార్చి 2035 వరకు మద్దతు ఇవ్వబడుతుందన్నారు. డిజిటల్ లావాదేవీని ప్రారంభించడానికి యుపిఐ లింక్ చేయబడిన రూపే క్రెడిట్ కార్డ్‌ను గరిష్టంగా రూ.30వేల పరిమితితో అందిస్తారని తెలిపారు. పీఎం స్వనిధి లబ్ధిదారులు, కుటుంబ సభ్యులకు సామాజిక, ఆర్థిక ప్రొఫైలింగ్‌ను నిర్వహించి ప్రోత్సహిస్తారని తెలిపారు. క్యూ.ఆర్. కోడ్ వంటి సులభతరమైన వాటి ద్వారా లావాదేవీలు జరిగేలా చూస్తారని తెలిపారు. వీధి విక్రయదారులు, కుటుంబ సభ్యులకు అక్టోబర్ 2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పి.ఎం. శ్రమ యోగి మందాన్ పెన్షన్ స్కీంలో 18 సంవత్సరాల పై బడిన వయస్సు వారు అందరు చేరవచ్చని తెలిపారు. అన్ని బ్యాంక్ లలో పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవన జ్యోతి భీమ యోజన, పిఎం జన ధన్ యోజన పథకాల ద్వారా లబ్ధి పొందాలని తెలిపారు. స్త్రీల ఆరోగ్యం, సమస్యల పరిష్కారాలను వివరించారు. కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, మేనేజర్ ఫణికుమార్, టౌన్ ప్లానింగ్ వివేకానంద, ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్, మెడికల్ డిపార్ట్మెంట్ అన్ని బ్యాంకుల మేనేజర్లు, కావలి పట్టణ పదాధికారులు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ జె.భారతి, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, కమ్యూనిటీ ఆర్గనైజర్, ఎస్.ఎల్.ఎఫ్.ల అధ్యక్షులు, ఆర్.పి.లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌విపాళెంలో ఆధార్ నమోదు

ప్రజాశక్తి బిట్రగుంట : బోగోలు మండలం ఎస్‌విపాళెం సచివాలయంలో బుధవారం ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆధార్ అప్డేట్ కార్యక్రమాలు 25న గురువారం ముంగమూరు, 26వ తేదీ శుక్రవారం నాగులవరం గ్రామంలో నిర్వహిస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్ గ్రామస్తుల ఆధార్ కార్డుల అప్డేట్ చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సంగం : మండలంలోని పడమటి పాలెం గ్రామంలో సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, పద్మజ దంపతులు మహాలక్ష్మమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు, విజయ గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు, విజయ గణపతిత ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి నవంబర్‌లో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రావుల లక్ష్మి, ప్రసాద్ గౌడ్ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగారెడ్డి పల్లెలో సమస్యల తిష్ట..

- **గ్రామంలో పారిశుద్ధ్య లోపం**
- **పలుచోట తాగునీటి పైపులైను లీకేజీ**
- **కలుషితమవుతున్న నీరు**
- **పట్టించుకోని పాలకులు ప్రభుత్వ అధికారులు**

ప్రజాశక్తి-సీతారాంపురం

మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో ఒకప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసి సమస్య పరిష్కరించుకున్న ఘన చరిత్ర కలదు. అయితే ప్రస్తుతం కనీస మౌలిక సమస్యలు పరిష్కరించలేని గ్రామంగా మూగబోయింది. అందుకు నిదర్శనం గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాలని చెప్పవచ్చు. గ్రామంలో డ్రెయినేజీ నిండా మురుగు నీరు నిండుకోవడం డ్రెయినేజీలు చుట్టుపక్కల పాటు కొన్ని డ్రెయినేజీలు పూడిపోయాయి. ప్రధానంగా సింగారెడ్డి పల్లె రోడ్డు సమీపంలో డ్రెయినేజీలో మురుగునీరు నింపుకోవడం నివాస ప్రాంతాలలో వ్యర్థనీరు పైపులైన్లు లీకేజీ మురుగు నిండుకోవడం నివాస ప్రాంతాలలో వ్యర్థనీరు పైప్‌లైన్‌లో లీకేజీ మురికి గుంతలుగా దర్శనమిస్తున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంక్ కింద బాగా పూర్తిగా పారిశుధ్యం లోపించి తాగునీటి ఒకపక్క పారిశుధ్య లోపం మరోపక్క ఎక్కడ పడితే అక్కడ లీకేజ్ అవ్వడంతో నీరు ఎంత కలుషితంగా మారి కొంతమంది రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఖాళీ ప్రదేశాలతో పాటు డ్రెయినేజీ సిమెంటు రోడ్లు మీదుగా పిచ్చి మొక్కలు మొలిచాయి. ఆఖరికి ఒక రహదారిలో విపరీతంగా పిచ్చి మొక్కలు ఉండడంతో ఆ రహదారి రాకపోకలు సమ్మించిపోయాయి. పారిశుధ్యం లోపించడంతో ఈగలు దోమలు ఉత్తరాతర క్రిమి కీటకాలు వృద్ధి చెంది రోగాలు తెచ్చిపెడుతున్నాయి. మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా కొన్ని ప్రాంతాలలో రాత్రి వేళలో కారు చీకట్లో కాలం గడపాల్సిన పరిస్థితి దాపురించిందని మహిళలు విమర్శిస్తున్నారు. గ్రామానికి ఎలాంటి అభివృద్ధికి చేయకపోయినా పర్వాలేదు కానీ మౌలిక సదుపాయాలు కల్పిస్తే శతకోటి వందనాలు తీరుతామని పలువురు మహిళలు పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు గూర్చి ఇటు పంచాయతీ పాలకులు గానీ అటు అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.